దివ్యాంగుల సబ్సిడీ రుణాలకు 44,188 దరఖాస్తులు

ఓల్డ్‌మలక్‌పేట ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సబ్సిడీ రుణాలకు రాష్ట్రవ్యాప్తంగా 44,188 దరఖాస్తులు వచ్చాయి. దివ్యాంగులకు స్వయం ఉపాధి కింద చిరువ్యాపారాలు నిర్వహించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమశాఖ ద్వారా వందశాతం మాఫీతో రుణాలు ఇచ్చేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. ఇటీవలే ఈప్రక్రియ ముగిసింది. అర్హులైన ఒక్కో వ్యక్తికి 50వేల రుణసాయం అందిస్తారు. రుణం పొందిన వారు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు. పూర్తిగా మాఫీ అవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుంచి రుణాల కోసం పెద్దఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. మొత్తం 711 యూనిట్లకు గాను 44,188 మంది దివ్యాంగులు దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో యూనిట్‌కు 62 మంది పోటీ పడుతున్నారు. ఆయా జిల్లాల పరిధిలో అర్హులను ఎంపిక చేసి మార్చి నెలలో రుణాలు అందిచేందకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సంబంధిత శాఖ అధికారులు పేర్కొన్నారు.

ప్రేమ పేరుతో బాలికకు వేధింపులు

- నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధించిన కోర్టు


నిందితుడు మహేంద్ర

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమ పేరుతో వేధిస్తూ అసభ్యంగా ప్రవర్తించిన యువకుడికి న్యాయస్థానం ఏడాది జైలు శిక్ష విధించింది. ప్రకాశం జిల్లా కందుకూరు మండలం గుడ్లూరుకు చెందిన పల్లపు మహేంద్ర(20) ఎల్‌బీనగర్‌లోని హస్తినాపురంలో ఉంటూ చదువుకుంటున్నాడు. ఈ నేపథ్యంలోనే ఓ బాలికతో పరిచయం పెంచుకున్న మహేంద్ర ప్రేమ పేరుతో వేధింపులు ప్రారంభించాడు. బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎల్‌బీనగర్ పోలీసులు దర్యాప్తు చేసి, కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అత్యాచార యత్నం, పోక్సో చట్టం ప్రకారం కేసు విచారణ చేసిన రంగారెడ్డి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి నిందితుడు మహేంద్రకు ఏడాది జైలు శిక్షతోపాటు రూ. 2 వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పును వెలువరించారు.

తుర్కయంజాల్‌కు హిమాచల్‌ప్రదేశ్ అపెక్స్ బ్యాంకు పాలకవర్గం


తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘాన్ని సందర్శించిన హిమాచల్‌ప్రదేశ్ అపెక్స్ బ్యాంకు పాలక వర్గం

హయత్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘాన్ని బుధవారం హిమాచల్‌ప్రదేశ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్, పాలకవర్గం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు సంఘం అభివృద్ధి కోసం తీసుకుంటున్న నిర్ణయాలు, రైతులకు అందిస్తున్న సేవలు, పని విధానం గురించి డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీఎన్‌రెడ్డినగర్, కొహెడా, తొర్రూర్ శాఖ కార్యాలయాలను పరిశీలించారు. సహకార సంఘం ఆధ్వర్యంలో కొహెడాలో నిర్మిస్తున్న గోదాంలను, కోల్డ్‌స్టోరేజీని కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీటీవి గౌతమ్ ప్యాకల్టీ, ఏజీఎం శైలజ, డీసీసీబీ హిమాచల్‌ప్రదేశ్ డెలిగేట్స్ జీబీ శర్మ, శక్తి చంద్ ఠాకూర్, ప్రేమ్‌కంషల్, తుర్కయంజాల్ సహకార సంఘం సెక్రెటరి రాందాస్‌గౌడ్‌తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సెక్షన్ 106 (1), (2)ను రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రవాణా రంగానికి నష్టం కలిగించేలా ఉన్న సెక్షన్ 106(1), (2)ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం హయత్‌నగర్ కుంట్లూర్ రోడ్డులో ఆటో యూనియన్, నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి హాజరై మాట్లాడారు. భారతీయ న్యాయ సంహితలో సెక్షన్ 106(1), (2) ప్రమాదకరంగా మారిందన్నారు. దీని వల్ల రవాణా రంగం పూర్తిగా నాశనమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రవాణా కార్మికులకు సామాజిక భద్రత చట్టాన్ని రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్‌వీ యాక్ట్ 2019ని రాష్ట్రంలో అమలు చేయవద్దని సూచించారు. ఈ చట్టాన్ని ఉపసంహరించుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాములు, అశోక్‌గౌడ్, రమేష్, యాదయ్య, రాజు, చిరంజీవి, శ్రీహరి, శ్రీనివాస్, వెంకటేష్, ప్రవీన్, తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బాటసింగారం రైతుసేవా సహకార సంఘంలో సభ్యుడైనా అనాజ్‌పూర్‌కు చెందిన ఏర్పుల చిన్న రంగయ్య వారం రోజుల క్రితం మృతిచెందాడు. దీంతో సహకార సంఘం ద్వారా రైతు కుటుంబానికి రూ.25 వేలను సంఘం చైర్మన్ భరత్‌కుమార్ బుధవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ ఐలేష్‌యాదవ్, మాజీ వైస్ చైర్మన్ వడ్డేపల్లి సతీష్‌గౌడ్, జంగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ హయత్‌నగర్ డివిజన్ సెక్రెటరీగా సక్రు నాయక్


సక్రు నాయక్

హయత్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సీపీఐ హయత్‌నగర్ డివిజన్ సెక్రెటరీగా సక్రు నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన సీపీఐ ఎల్‌బీనగర్ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశంలో సక్రు నాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి మాట్లాడుతూ ఎల్‌బీనగర్‌లో పార్టీని బలోపేతం చేయడానికి అన్ని డివిజన్లకు కార్యదర్శులను నియమిస్తున్నట్లు తెలిపారు. సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి శేఖర్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

కులగణన రీ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి


రాపోలు జయప్రకాష్‌తో టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి, తదితరులు

మన్సూరాబాద్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన రీ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బీసీ కమిషన్ సభ్యుడు రాపోలు జయప్రకాశ్ కోరారు. బుధవారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కులగణన రీ సర్వేను, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



తుర్కయంజాల్ మున్సిపాలిటీ కొహెడాలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం కమిటీ చైర్మన్ కాటేపల్లి రాఘవేందర్‌రెడ్డి రూ.30 వేల విలువ గల క్రీడా దుస్తులను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తిరుపతిబాయ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

- హయత్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి)


చైతన్యపురిలో శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, తదితరులు


మూసారాంబాగ్ రోడ్‌లో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి, నాయకులు గణేశ్, హరిగౌడ్, మధుసూదన్‌రెడ్డి, రంజిత్ టీమ్ సభ్యులు


మన్సూరాబాద్‌లో శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి, తదితరులు


అల్మాస్‌గూడలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు యాదవ్

వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ

భారత దేశ వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ అని, దేశ యువతకు ఆయన ఆదర్శమని వక్తలు కొనియాడారు. బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఎల్‌బీనగర్, నాగోల్, కొత్తపేట, మన్సూరాబాద్, హస్తినాపురం, అబ్దుల్లాపూర్‌మెట్, వనస్థలిపురం, హయత్‌నగర్, తుర్కయంజాల్, బాలాపూర్, అల్మాస్‌గూడ, జిల్లెలగూడ, తదితర ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. యూత్ అసోసియేషన్లు, ఆలయ కమిటీలు, అభిమానుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో శివాజీ చిత్రపటాలకు, విగ్రహాలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ బృందం


జడ్జెస్‌కాలనీలోని శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి తదితరులు


తుర్కయంజాల్‌లో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు, యువకులు


నాగోల్‌లో బైక్ ర్యాలీలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ యాదవ్, తదితరులు



శివాజీకి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్ తదితరులు


నాగోల్ చౌరస్తాలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ తదితరులు


డిఫెన్స్‌కాలనీలోని శ్రీ హరిహర క్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలో శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, తదితరులు


గడ్డిఅన్నారం బస్తీలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ సీనియర్ నాయకులు సామ మల్లారెడ్డి, తిరుమల్‌రెడ్డి తదితరులు


ఎన్‌టీఆర్‌నగర్‌లో శివాజీ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మధుర ఉపేందర్‌రెడ్డి, భవానీ, విజయ్, తదితరులు


బాలాపూర్‌లో శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మేయర్ పారిజాతారెడ్డి, తదితరులు

ఎల్‌బీనగర్‌ను అభివృద్ధి చేస్తాం : మధుయాష్కీ

చంపాపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా ఎల్‌బీనగర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని సప్తగిరిహిల్స్ కాలనీలో బుధవారం మధుయాష్కీగౌడ్ స్థానిక కార్పొరేటర్ సుజాతనాయక్‌తో కలిసి పర్యటించి, ప్రజా నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సప్తగిరిహిల్స్ కాలనీవాసులు రహదారులు, యూజీడీ నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయాలని కోరితే కొందరు ప్రజాప్రతినిధులు ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రహదారులు, తాగునీరు, యూజీడీ, నాలా నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వనస్థలీపురం కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి భాస్కర్‌యాదవ్, ఆయా డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, నర్సింహయాదవ్, సదాశివుడు, వేణుగోపాల్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అశోక్ గౌడ్, సత్యనారాయణ, రమేష్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

హస్తినాపురం డివిజన్‌లోని కాటం పార్వతమ్మకాలనీలోని పార్కులో బుధవారం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, మాజీ ఎంపీ రవీందర్‌నాయక్, సీనియర్ ఐఏఎస్ అధికారి భారతినాయక్, కార్పొరేటర్ సుజాతనాయక్ హాజరై సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ కో-కన్వీనర్ వజీర్ ప్రకాష్‌గౌడ్, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ ఎస్టీసెల్ అధ్యక్షుడు రమేష్‌నాయక్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాన



హస్తినాపురం డివిజన్ సప్తగిరిహిల్స్ కాలనీలో జీహెచ్ఎంసీ నిధులు రూ.65లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ సుజాతనాయక్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ యంపీ మధుయాష్కీగౌడ్‌తో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్‌నాయక్, రాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌దే


కృష్ణానీటి సరఫరాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మిషన్ భగీరథ పథకం ద్వారా పైపులైన్లు, భూగర్భ ట్యాంకులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, భారీ రిజర్వాయర్లు నిర్మించి ఇంటింటికీ తాగునీరు అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా కూడా గుక్కెడు నీరు ఇచ్చిన దాఖలాలు లేవని ఆమె విమర్శించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ 4వ డివిజన్‌లోని విశాకనగర్ కాలనీలో కృష్ణానీటి సరఫరాను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్లాకు పూజ చేసి నీరు విడుదల చేసి బిందెలో నింపి స్థానిక మహిళలకు అందజేశారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నాటి కేసీఆర్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో మిషన్ భగీరథ పథకానికి రూపకల్పన చేసిందని అన్నారు. ఈ పథకంలో భాగంగా అక్కడక్కడా మిగిలిపోయిన పనులను సైతం తొందరగా పూర్తి చేయించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సంరెడ్డి స్వప్నావెంకట్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, బోయపల్లి దీపికాశేఖర్ రెడ్డి, రామిడి కవితారాంరెడ్డి, ముత్యాల లలితాకృష్ణ, బీఆర్ఎస్ అధ్యక్షుడు రాంరెడ్డి, కాలనీ అధ్యక్షుడు సుభాష్‌రెడ్డి, ఇతర ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


మంత్రి పొన్నంను సన్మానిస్తున్న శ్రీనివాస్ దంపతులు

ప్రత్యంగిర అమ్మవారికి అన్నాభిషేకం

- దర్శించుకున్న మంత్రి పొన్నం

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని కుర్తాల పీఠ శ్రీ ప్రత్యంగిర పరమేశ్వరి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం అన్నాభిషేకం ఘనంగా నిర్వహించారు. అమ్మవారు విశేషాలంకరణలో భక్తులకు దర్శనమించారు. అమ్మవారిని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే కిచ్చెనగారి లక్ష్మారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి గిడుగు రుద్రరాజు, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ రాధధీరజ్ రెడ్డి, విద్యాశాఖ కమిషనర్ దేవసేన, చిలుక ఉపేందర్‌రెడ్డి, పున్న గణేష్ దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆలయ కార్యదర్శి శ్రీనివాస్, సువర్ణలత దంపతులు ఘనంగా సత్కరించారు. సామూహిక కుంకుమార్చన, పారాయణంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కబ్జాలపై బీజేపీ ఆరోపణలు అవాస్తవం

సబితారెడ్డి ఎమ్మెల్యే కాకముందే నిర్మాణాలు • బీఆర్ఎస్ నేతల స్పష్టీకరణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌రెడ్డి, రాంరెడ్డి, తదితరులు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్‌లో ఎమ్మెల్యే సబితారెడ్డి కనుసన్నల్లో ఆమె అనుచరులు కబ్జాలకు పాల్పడుతున్నారంటూ బీజేపీ నేతలు చేసిన ఆరోపణలు అర్థరహితమని, తాము ఎక్కడా కబ్జాలకు పాల్పడలేదని, అధికారులు చేసే ఏ విచారణకైనా తాము సిద్ధమేనని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. బుధవారం బడంగ్‌పేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, పార్టీ నాయకులు పెద్దలు ఆనంద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బీమిడి జంగారెడ్డి, కర్రె కృష్ణ, పి.అంజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. బడంగ్‌పేట్ ప్రధాన రహదారిలోని నాలా పక్కన జరిపిన నిర్మాణం నిబంధనల ప్రకారమే ఉన్నదని అన్నారు. ఎమ్మెల్యే సబితారెడ్డి అండతో కబ్జాలు చేశారని అంటున్నారని, అసలు సబితమ్మ 2009లో ఎమ్మెల్యేగా గెలవకముందే 2007లోనే తాము ఇక్కడ అన్ని అనుమతులతో, నిబంధనల ప్రకారం నిర్మాణాలు పూర్తి చేశామని, అలాంటప్పుడు ఆమెపై అబాండాలు వేయడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. తమ వద్ద ఇరిగేషన్, రెవెన్యూ విభాగాలకు చెందిన అన్ని పత్రాలు ఉన్నాయని, తాము ఎక్కడా నాలాలు, పార్కులు, చెరువులు కబ్జా చేయలేదని వారు పేర్కొన్నారు. బడంగ్‌పేట్ ప్రధాన రహదారిపై ఉన్న నాలాను బీజేపీ నాయకులే కబ్జా చేశారని, కబ్జాదారులు సైతం ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని వారు ఎద్దేవా చేశారు.

అనుమతి లేదని పశువుల షెడ్డు కూల్చివేత

- పంచాయతీ కార్యదర్శి తీరు పట్ల బాధితుడి ఆవేదన

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గండిచెరువు గ్రామంలో ఓ వ్యక్తి తన వ్యవసాయ భూమిలో పశువుల షెడ్‌ను ఏర్పాటు చేస్తుండగా అనుమతి లేదంటూ పంచాయతీ కార్యదర్శి కూల్చివేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 240, 241, 244లో శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి సంవత్సరం క్రితం సుమారు 1800 గజాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. అనంతరం అతడు యూఎస్ఏకు వెళ్లాడు. భూమి బాధ్యతలను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి అప్పగించాడు. అందులోని సుమారు 120 గజాల స్థలంలో పశువులను పెంచేందుకు షెడ్‌ను నిర్మిస్తున్నారు. వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేస్తున్న పశువుల షెడ్‌కు అనుమతి లేదంటూ బుధవారం పంచాయతీ కార్యదర్శి ఎక్స్‌కవేటర్ సహాయంతో కూల్చివేయించారు. అధికారులు నోటీసులు ఇవ్వకపోగా కనీసం కూల్చివేస్తున్నట్లు కూడా సమాచారం ఇవ్వలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పశువుల షెడ్డును కూల్చివేసిన కార్యదర్శిపై చర్యలు తీసుకోని, తమకు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

సరూర్‌నగర్ కమర్షియల్ కాంప్లెక్స్..

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ కమర్షియల్ కాంప్లెక్స్‌లోని శిథిలావస్థకు చేరిన దుకాణాలను హెచ్ఎండీఏ అధికారులు బుధవారం కూల్చివేశారు. లీజు గడువు పూర్తి అయినప్పటికీ ఖాళీ చేయకుండా అక్రమంగా ఉంటున్న దుకాణదారులను కోర్టు ఆదేశానుసారం ఇటీవల హెచ్ఎండీఏ అధికారులు ఖాళీ చేయించి సీజ్ చేసిన విషయం విదితమే. బుధవారం ఉదయం పోలీసు బందోబస్తుతో వచ్చిన హెచ్ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డీఎస్పీ జానకీ రెడ్డి, ఎస్టేట్ అధికారి రాజేశ్వరి ఇతర అధికారులు శిథిలావస్థకు చేరిన కాంప్లెక్స్ దుకాణాలను ఎక్స్‌కవేటర్లతో కూల్చివేయించారు.

వ్యక్తి ఆత్మహత్య

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కలహాలు భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. చాదర్‌ఘాట్ ఎస్ఐ భరత్ తెలిపిన వివరాల ప్రకారం ఓల్డ్‌మలక్‌పేట వాహేద్‌నగర్ నివాసి సయ్యద్ ఆజం (43) రోజువారి కూలి. ఇతనికి భార్య, నలుగురు పిల్లలు న్నారు. ప్రతిరోజూ ఇంట్లో ఏదో విషయంలో గొడవ జరుగుతూనే ఉంటుంది. ఈ నేపథ్యంలోనే మనస్తాపం చెందిన ఆజం మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారమివ్వడంతో వారు వచ్చి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.